క్లుప్తంగా

నేడు తీజ్ వేడుకలు

టేకులపల్లి: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న బంజారాల బతుకమ్మ తీజ్ వేడుకలను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ నాయకులు ధరావత్ ప్రేమ్‌చంద్ నాయక్, భూక్యా గన్నానాయక్, భూక్యా కిషోర్ సింగ్, బానోతు సక్రునాయక్, బోడా మంగీలాల్ నాయక్, బోడా లాలు నాయక్ ఓ ప్రకటనలో కోరారు. స్థానిక రామాలయం వద్ద స్టేజీ వేయగా వాగు వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈనెల 9న ప్రారంభమైన తీజ్ వేడుకలు ఆదివారం నిమజ్జనంతో ముగియనున్నాయని చెప్పారు. మధ్యాహ్నం 3గంటలకు రామాలయం వద్దకు తీజ్ బుట్టలతో యువతులు రానుండగా అక్కడి నుంచి శోభాయాత్రగా నిమజ్జనానికి వెళ్తారని పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ చివరి దశ కౌన్సెలింగ్

ఇల్లెందు: సింగరేణి అధికారులు, ఉద్యోగుల పిల్లలకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మంథనిలో బీటెక్ కోర్సు చేసేందుకు చివరి దశ కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. శనివారం ఇల్లెందులో మాట్లాడుతూ.. అధికారుల పిల్లలకు 14 సీట్లు, ఉద్యోగుల పిల్లలకు 11 సీట్లు ఉన్నట్లు తెలిపారు. మైనింగ్ ఇంజనీరింగ్ 32, సివిల్ ఇంజనీరింగ్ 33, మెకానికల్ ఇంజనీరింగ్ 33, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ 32, కంప్యూటర్ సైన్స్ 10 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు, ఈ నెల 20న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

గురుకులంలో 19 సీట్లు ఖాళీలు

ఇల్లెందు: ఇల్లెందు మండలం సుదిమళ్ల గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్‌లో ఏడు సీట్లు ఖాళీలు ఉన్నట్లు ప్రిన్సిపాల్ రత్నకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరగోరు బాలికలు 2023–24లో టెన్త్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఎంపీసీలో నాలుగు, బీపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీలో ఒక్కో సీటు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇదే కాంప్లెక్స్‌లోని స్కూల్ (కళాశాల)లో మొదటి సంవత్సరం ఎంపీసీలో 12 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన గిరిజన బాలికలు ఈ నెల 20న ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాల్వంచరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రూరల్ ఎస్‌ఐ బి.సురేష్ కోరారు. మండల పరిధి కిన్నెరసానిలోని రూరల్ పోలీసు స్టేషన్‌లో శనివారం సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు ఎస్‌ఐ అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలను నడిపేవారికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేడు పద్మశాలి సంఘం ఎన్నికలు

కొత్తగూడెంటౌన్: రాష్ట్రవ్యాప్తంగా పద్మశాలీ సంఘం జిల్లా కార్యవర్గాలను ఎన్నుకునేందుకు ఆదివారం ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జిల్లా ఎన్నికల అధికారిగా కొత్తగూడేనికి చెందిన న్యాయవాది మెండు రాజమల్లు వ్యవహరించనుండగా, కొత్తగూడెం, ఇల్లెందు బూత్‌ల్లో ఎన్నికలను పుట్టా శంకరయ్య, బొద్దుల శ్రీనివాస్ పర్యవేక్షిస్తారు. కాగా, కొత్తగూడెంలోని భజన మందిరం సమీపాన పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం ఉదయం 7నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నిక జరుగుతుందని రాజమల్లు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

పాల్వంచరూరల్: మండలంలోని జగన్నాథపురం పీహెచ్‌సీ పరిధిలో నాగారంకాలనీ, రంగాపురం గ్రామాల్లో శనివారం వైద్యసిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటా ర్యాపిడ్ ఫీవర్ సర్వేను డాక్టర్ రాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నివాసాల్లో ఉన్న నీటి నిల్వలను తొలగించారు. ఇంటిపరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వేడి చేసి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణ, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఇందిర, ఆశా జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదువుకోవాలి

పాల్వంచరూరల్: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలిని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమణ అన్నారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బ్యాండ్ బాజాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. సీనియర్ వైస్‌ప్రిన్సిపాల్ ఆర్.రామకృష్ణ, ఉపాధ్యాయులు కరుణాకర్, దేవిశ్రీ, సుభాషిణి, మల్లేష్, కృష్ణ, అన్వేష్ పాల్గొన్నారు.






వివిధ రకాల మోడళ్లలో రాఖీలు

అన్నాచెల్లెళ్ల బంధం

- రేపు రాఖీ పండుగ
- మార్కెట్‌లో ఆకట్టుకుంటున్న మోడళ్లు
- ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే నేరుగా ఇంటికే..

పాల్వంచరూరల్: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రాఖీ పౌర్ణమి పండుగ వచ్చేసింది. అన్నయ్య ఎక్కడో దూరంగా పనిచేస్తున్నాడు. పోస్టులో పంపితే సమయానికి చేరుతుందో లేదో తెలియదు. ఒకవేళ వెళ్లినా రాఖీ చిరిగిపోవడమో, వెళ్లక పోవడమో జరిగితే? ఇలాంటి అనుమానాలు, ఆందోళనలు ఇక అక్కర్లేదు.. ఎందుకంటే మీ దగ్గర ఒక స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్‌లో ఆన్‌లైన్ సౌకర్యం ఉంటే ఒక్క క్లిక్‌తో మీ సోదరులకు దేశంలో ఎక్కడ ఉన్న ఆన్‌లైన్ ద్వారా రాఖీలను పంపించవచ్చు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ, ఈ పండుగకు తోబుట్టువుల సందడి అంతా ఇంతా కాదు. వివాహాలు చేసుకుని అత్తారింటికి వెళ్లినవారు కూడా రాఖీ పండుగకు రెండురోజుల ముందుగానే పుట్టింటికి వస్తారు. ఉద్యోగ రీత్యా వేరేప్రాంతాల్లో ఉండే సోదరులు కూడా సోదరితో రాఖీ కట్టించుకునేందుకు ఎంతో తహతహలాడుతుంటారు. ఒక్కప్పుడు రాఖీపండుగ అంటే రాఖీలు కొనాలి, దాన్ని పోస్టు లేదా కొరియర్ పంపేందుకు బజారుకు వెళ్లాలి. అయితే నేటి హైటెక్ యుగంలో మనుషుల మధ్య దూరం పెరిగినా అనుబంధాలు మాత్రం తగ్గడం లేదని చెప్పవచ్చు. రాఖీలను ఆన్‌లైన్ ద్వారా పంపించే వెసులుబాటు అందుబాటులోకి రావడమే దీనికి నిదర్శనం. పలు వెబ్‌సైట్లు దీనికి అవకాశం కల్పిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఇంటికే...

ఆన్‌లైన్‌లో ఆకర్షణీయమైన అనేక రకాల రాఖీలు అందుబాటులో ఉన్నాయి. అయితే బయట మార్కెట్ కంటే ఆన్‌లైన్‌లో రాఖీల ధరలు కాస్తా ఎక్కువే. బంగారుపూత పూసిన, ముత్యాలతో అలంకరించిన రాఖీలు ఇలా అనేక రకాలు లభిస్తున్నాయి. చిన్నారులను ఆకట్టుకునే మిక్కీ మౌస్, వివిధ రకాల బొమ్మల ఆకృతి కలిగిన రాఖీలు ఉన్నాయి. రూ.100 దగ్గర నుంచి రూ.10వేల విలువ కలిగిన రాఖీలు కూడా లభిస్తున్నాయి.



పాల్వంచలో రాఖీలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

సండే స్పెషల్



మార్కెట్‌లో ఆకట్టుకుంటున్న రాఖీలు

రకరకాల మోడళ్లు ఉన్నాయి..



మార్కెట్‌లోని దుకాణాలలో రాఖీలు పాతమోడల్స్‌లో ఉంటున్నాయి. ఆన్‌లైన్‌లో అయితే కొత్తకొత్త మోడల్స్ లభిస్తున్నాయి. ఇంటర్‌నెట్ ముందు కూర్చొని నచ్చిన రాఖీలను ఎంపిక చేసుకుని ఆర్డర్ చేస్తే ఇంటికే వస్తాయి.

– సుమ, బీటెక్ విద్యార్థి, పాల్వంచ

ఇప్పుడు రాఖీ పంపడం ఈజీ..



రాఖీ కోసం బజారుకు వెళ్లి కొనుగోలు చేయాలంటే సమయాన్ని వృథా చేయాల్సి వస్తోంది. ఆన్‌లైన్‌లో సమయంతోపాటు డబ్బు ఆదా చేసుకోవచ్చు. హైదరాబాద్‌లో ఉన్న మా తమ్ముడికి రాఖీ పంపిస్తాను.

– శృతి, డిగ్రీ విద్యార్థి, పాల్వంచ

దుమ్ము, ధూళిని నివారించాలి



అధికారులతో మాట్లాడుతున్న స్థానికులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు నుంచి బొగ్గు లోడుతో వచ్చే లారీలు, టిప్పర్ల వల్ల దుమ్ము, ధూళితో అనారోగ్యం పాలవుతున్నామని దాసుతండా గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ మేరకు శనివారం కేటీసీకి వెళ్తున్న సింగరేణి అధికారులను, లారీలు, టిప్పర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. అధికారులను నిలదీశారు. రూ.కోట్లు గడిస్తున్న సింగరేణి అధికారులు రోడ్లకు మరమ్మతులు చేయకపోవడం, రోడ్లపై నీటి పిచికారీ చేయకపోవడం గర్హనీయన్నారు. ప్రతీ రోజూ రోడ్లపై నీళ్లను పిచికారీ చేయాలని కోరారు. ట్యాంకర్‌తో రోడ్లపై నీటిని పిచికారీ చేయిస్తామని సింగరేణి అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలో విద్యావ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థి యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ కోరారు. ఈ మేరకు ఆయన కొత్తగూడెంలో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు వినతిపత్రం అందజేశారు. సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్ అమలు చేయాలనే నిర్ణయం మంచిదేని తెలిపారు. తొలుత పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు అన్నిరకాల మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం పట్టుకున్నారు. మొర్రేడు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా అల్లూరి సెంటర్ వద్ద ఎస్‌ఐ సుమన్ ట్రాక్టర్‌తో పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ కల్యాణ్‌పై కేసు నమోదు చేశారు.

రక్తదానం చేయండి..

కొత్తగూడెంఅర్బన్: తలసేమియాతో బాధపడుతున్న వారికి దాతలు ముందుకొచ్చి రక్తదానం చేయాలని జిల్లా పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శులు తెలిపారు. శనివారం కొత్తగూడెం అంబేద్కర్ భవనంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు రమణ, పంచాయతీ కార్యదర్శుల సంఘం నుంచి కిరణ్‌కుమార్, వంశీకృష్ణ, అనంత్, బాబూరావు, వెంకట్, ఉద్యోగులు విక్రమ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

పోలీసులు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రేణుక

పాల్వంచ: నవనగర్‌లో ఓ వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై గత నవంబర్‌లో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిందని, ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని జిల్లా మానవ హక్కుల సంఘం సెక్రటరీ గోనె రేణుక ఆరోపించారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నవనగర్‌లోని ఓ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడి భార్యను అక్కడే పనిచేసే మరో ఉద్యోగి లైంగిక వేధింపులకు దిగాడని, దీంతో మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఇది నచ్చని పాఠశాల యాజమాన్యం వారిని విధుల్లోంచి తొలగించిందని, పిల్లలను పాఠశాలకు కూడా రానివ్వడం లేదన్నారు. ఈ విషయాన్ని చైల్డ్ లైన్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా ఎస్పీ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించండి

ఇల్లెందు: ఏరియాలో పని చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. శనివారం ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ నాయకులు నబీ మాట్లాడుతూ.. గార్డులకు కనీస వేతనం చెల్లించాలని, పేస్లిప్పులు, ఎంప్లాయ్‌కార్డులు, మెడికల్ బుక్స్, రక్షణ పరికరాలు అందజేయాలని కోరారు.

బీఆర్‌ఎస్ నిరసన ర్యాలీ..



ఆందోళన నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇల్లెందు: సిద్ధిపేటలో మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు అధికారిక నివాసం మీద కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు తీవ్రంగా ఖండించాలని బీఆర్‌ఎస్ నాయకుడు దిండిగల రాజేందర్ పిలుపునిచ్చారు. శనివారం ఇల్లెందులోని జగదాంబా సెంటర్‌లో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాట్లాడుతూ.. అర్ధరాత్రి ఇంటి తాళాలు పగుల కొట్టి ఫ్లెక్సీలు చించివేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. గుండాగిరిని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ తీరును యావత్ తెలంగాణ సమాజం గ్రహించాలని కోరారు. ఓ మాజీ మంత్రికే ఈ పరిస్థితి వుంటే సామాన్యుడి గతి ఏంటన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఏనాడూ ఒక్క కాంగ్రెస్ నాయకుడి ఇంటి మీద దాడులు జరగలేదన్నారు. ప్రజల కాంగ్రెస్ పాలనను గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండీ జబ్బార్, అజ్మీర భావ్‌సింగ్, సిలివేరు సత్యనారాయణ, డేరంగుల పోషం, హరిప్రసాద్ యాదవ్, ఆదూరి రవి, గిన్నారపు రాజేష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా రాఖీ వేడుకలు



పాల్వంచ: శ్రీ విద్య పాఠశాలలో..



కొత్తగూడెంఅర్బన్: సింగరేణి పాఠశాలలో..

శ్రీ రాగా ప్లే స్కూల్‌లో..

కొత్తగూడెంఅర్బన్: శ్రీ రాగా ప్లే స్కూల్‌లో రాఖి పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, ఉపాధ్యాయులతో కలిసి స్కూల్ డైరెక్టర్ మాల్లారపు కవిత, తయారు చేసిన రాఖీలను అమ్మాయిలతో అబ్బాయిలకు కట్టించారు. కరస్పాండెంట్ మాల్లారపు వరప్రసాద్, ఉపాధ్యాయులు రాంబాబు, సంధ్య, జ్యోతి, చైతన్య, రాంసింగ్, పూజిత, నాగమణి, హారిక పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలలో..

సేవా భారతి స్వచ్ఛంద సేవా సంస్థ కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో సింగరేణి పాఠశాలలో సామూహిక రక్షాబంధన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పూల్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రివేణి పాఠశాలలో..

కొత్తగూడెంరూరల్: అన్నా చెల్లెలు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ వేడుకలు లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి పాఠశాలలో శనివార ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ గొల్లపూడి జగదీశ్, సీఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ వైవీ సురేష్, శ్రీనివాస్‌సింగ్ ఉన్నారు.



శ్రీ రాగా ప్లే స్కూల్‌లో...

పాల్వంచ: శ్రీవిద్య పాఠశాలలో విద్యార్థులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్వీట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడు ‘కొత్వాల’కు సన్మానం

పాల్వంచ: స్వాతంత్య్ర దినోత్సవం నాడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఉత్తమ పాల్వంచ సొసైటీ అధ్యక్షుడిగా కొత్వాల శ్రీనివాసరావు ప్రశాంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ మేరకు శనివారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాలకవర్గం ఆధ్వర్యంలో చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావును సన్మానించారు. కొత్వాల మాట్లాడుతూ... పాలకవర్గ సభ్యులు, రైతుల సహకారం, అధికారుల సమన్వయంతో ప్రశాంసా పత్రాన్ని అందుకోవడం జరిగిందని, రానున్న రోజుల్లో ఇదే సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ స్వప్న, వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేశ్, సూపర్‌వైజర్ వి.సురేష్, సొసైటీ డైరెక్టర్లు కనగా నారాయణరావు, పాపారావు, మైనేని వెంకటేశ్వరరావు, సీఈఓ జి.లక్ష్మీనారాయణ, ఎఫ్ఎల్‌సీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



శ్రీనివాసరావును సన్మానిస్తున్న సొసైటీ పాలకవర్గ సభ్యులు

గోదావరి జలాలు జిల్లాకు అందించండి..



నిరసన తెలుపుతున్న వామపక్ష రైతు సంఘాల నాయకులు

జూలూరుపాడు: గోదావరి జలాలతో జిల్లాలోని సాగు భూములకు అందించి సస్యశ్యామలం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వినోభానగర్ గ్రామ సమీపంలోని సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌ను వామపక్ష రైతు సంఘాల నాయకులు సందర్శించి, పరిశీలించారు. కెనాల్ లాకుల వద్ద నిరసన తెలిపారు. మాట్లాడుతూ... గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన సీతారామ ప్రాజెక్ట్ పనులు ఎనిమిదేళ్లలో పూర్తి చేయలేకపోయిందన్నారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆగమేఘాల మీద కొత్తగా రీడిజైన్ పేరుతో పనులు ప్రారంభించి జూలూరుపాడు మండలానికి చుక్క నీరు కూడా ఇవ్వలేదన్నారు. పూసుగూడెంలో పంపు హౌస్–2ను ప్రారంభించారే గానీ కెనాల్‌లో నీరు ప్రవహించలేదని, ఇది రైతాంగాన్ని మోసం చేయడమేనన్నారు. పాత డిజైన్ ప్రకారం రోళ్లపాడు రిజర్వాయర్‌ను పూర్తి చేసి జిల్లాలోని సాగు భూములకు నీరు అందించి, రైతులకు న్యాయం చేయాలన్నారు. ఏన్కూరు లింక్ కెనాల్‌ను ఎన్నెస్పీ కెనాల్‌కు అనుసంధానం చేసి గోదావరి జలాలను తరలించడం సరైంది కాదని, ముందుగా జిల్లాలోని సాగు భూములకు అందించాలన్నారు. జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయల సిద్ధు, గడిదేశి కనకరత్నం, ఎస్కే మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి..



టేకులపల్లి: నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

కోల్‌కత్తాలో మెడికో విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను ఉరితీయాలని శనివారం పలువురు డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల, సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. నిందితులను శిక్షించినప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. పీజీ వైద్యురాలి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంరూరల్: బస్టాండ్ సెంటర్‌లో దర్నా నిర్వహిస్తున్న వైద్యులు, నర్సులు



కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లో నిరసన తెలుపుతున్న స్థానికులు



ఇల్లెందు: కొవ్వొత్తులతో మార్కెట్ ఉద్యోగులు నిరసన ర్యాలీ..



ఇల్లెందురూరల్: కొమరారం పీహెచ్‌సీ వద్ద



జూలూరుపాడు: నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్యసిబ్బంది



జూలూరుపాడులో ...



పాల్వంచ: ట్రేడ్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో..



సింగరేణి ప్రధానాస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు



పాల్వంచ: ప్రభుత్వాస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది